జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఖమ్మం

సోమవారం | 4 | మే | 2026 ◆ పేజీలు : 6

## నీట్-యూజీ 2026 పరీక్షా కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** వైద్య, విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఖమ్మం పోలీస్ కమిషనరేట్ లో నిర్వహించే నీట్–యూజీ 2026 పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పటిష్ట పోలీస్ బందోబస్త్, భద్రతను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించి,పరిశీలించారు.ఆదివారం మధ్యాహ్నం 12గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అంక్షాలు అమలులో ఉంటుందన్నారు. శాంతి నగర్ కాలేజ్, కేంద్రీయ విద్యాలయం సందర్శించిన పోలీస్ కమిషనర్ టౌన్ ఏసీపీ రమణమూర్తి కి పలు సూచనలు చేశారు.



## భానుడి భగభగలపై...

# వర్షపు తిరుగుబాటు..!

- **నిప్పుల కొలిమిలా మారిన నేలపై అమృతపు చినుకులు**
- **ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరైన జనానికి వానదేవుడి వరం**

**నేలకొండపల్లి, మే 3 ప్రజాజ్యోతి :** ఎండాకాలం ప్రారంభం నుండే భానుడు భూమిమీద నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. ఆకాశమంతా అగ్ని గోళంలా ఎర్రబడి, రోడ్లన్నీ వేడి సెగలతో మంటలు రేపుతున్నట్లు కనిపిస్తున్నాయి. చెట్టు నీడ కూడా చెమటలు కార్చేంతగా ఎండ తాకిడి పెరగడంతో జన జీవనం అస్తవ్యస్తమవుతుంది. పక్షులు సైతం రెక్కలు ముడుచుకుని నీడ కోసం అలమటించగా.. మనుషులు ఒక్క అడుగు బయటపెట్టాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంటుంది. అలాంటి వేళ.. ఆదివారం సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా తన స్వరూపం మార్చుకుంది. నల్లని మేఘాలు నెమ్మదిగా భూమిని కమ్ముకుంటూ వచ్చాయి. వేడి గాలుల స్థానంలో చల్లని పవనాలు మృదువుగా తాకాయి. ఆ వెంటనే ఆకాశం నుంచి జారిపడ్డ వాన చినుకులు.. మండుతున్న నేల గుండెలపై పడిన అమృత బిందువుల్లా అనిపించాయి. మొదటి చినుకు నేలను తాకగానే మట్టి పరిమళం గాలిలో విరజిమ్మింది. ఉక్కపోతతో ఊపిరాడక అలమటించిన జనాలు వాన జల్లుల్లో ఉపశమనాన్ని వెతుక్కున్నారు. చిన్నారులు ఆనందంతో వర్షంలో తడుస్తూ కేరింతలు కొట్టగా పెద్దలు ఆకాశం వైపు చూస్తూ హమ్మయ్య.. అంటూ ఊపిరి పీల్చుకున్నారు. సుమారు గంట సేపు భారీ వర్షం కురిసింది. ప్రకృతి తన కరుణ చూపితే ఎంతటి ఎండనైనా ఓడించగలదని ఈ వర్షపు జల్లులు మరోసారి గుర్తుచేశాయి.

## నేడు నిర్వహించు మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- **93 కంపెనీల భాగస్వామ్యంతో 4000కు పైగా ఉద్యోగ అవకాశాలు లభ్యం**



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి :** ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నేడు ఉదయం 9 గంటల నుండి ఎస్.ఆర్.గార్డెన్స్, ఖమ్మం లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, ఇట్టి అవకాశాన్ని నిరుద్యోగ యువతీ,యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబ్ మేళాలో సుమారు 93 కంపెనీలు పాల్గొంటున్నాయని, 4000కు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ఐటీ, ఫార్మా ,తయారీమార్కెటింగ్,టెలికమ్యూనికేషన్,కస్టమర్ కేర్,లాజిస్టిక్స్ తదితర విభిన్న రంగాల్లో ఈ అవకాశాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.జిల్లాలోని యువతకు నేరుగా ఉపాధి అవకాశాలు కల్పించడం,నైపుణ్యాలను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉపయోగించడం ఈ జాబ్ మేళా ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు.ఈ నేపథ్యంలో 18 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు

మిగతా 2 లో...

## ఆర్టీసీ బస్సు కు తృటిలో తప్పిన ప్రమాదం...!

- వర్షం కు పంట పొలాలల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



2 లో...

## గాలి దుమారానికి విరిగిన చెట్లు

- **బోనకల్ ఖమ్మం ప్రధాన రహదారి రాక పోకలకు అంతరాయం**
- **వెంటనే స్పందించిన బోనకల్ సర్పంచ్ జ్యోతి కొండ**
- **జెసిబి సహాయంతో తక్షణ చర్యలు**
- **అభినందించిన స్థానికులు**



**బోనకల్, మే 3 (ప్రజాజ్యోతి):** బోనకల్ గ్రామంలో అకాల గాలి దుమారం, కురిసిన అకాల వర్షాల కారణంగా బోనకల్ నుండి ఖమ్మం వెళ్లే మార్గంలో ముష్టికుంట్ల ప్రధాన రహదారిపై చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్డుమీద పడిపోయిన చెట్లతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలిసిన వెంటనే బోనకల్

మిగతా 2 లో...

## ఈదురు గాలులకు విరిగిపోయిన చెట్లు

- రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు వాహనాదరులకు ట్రాఫిక్ అంతరాయం
- ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరైన జనానికి వానదేవుడి వరం



**చింతకాని మే03ప్రజాజ్యోతి ప్రతి నిధి షేక్ సైదులు:** ఎండాకాలం ప్రారంభం నుండే భానుడు భూమి మీద నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. ఆకాశమంతా అగ్నిగోళంలా ఎర్రబడి, రోడ్లన్నీ వేడి సెగలతో మంటలు రేపుతున్నట్లు కనిపిస్తున్నాయి. చెట్టు నీడ కూడా చెమటలు కార్చేంతగా ఎండ తాకిడి పెరగడంతో జన జీవనం అస్తవ్యస్త మవుతుంది. పక్షులు సైతం రెక్కలు ముడుచుకుని నీడ కోసం అలమటించగా.మనుషులు ఒక్క అడుగు బయటపెట్టాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంటుంది.అలాంటి వేళ..ఆదివారం సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా తన స్వరూపం మార్చుకుంది. నల్లని మేఘాలు నెమ్మదిగా భూమిని కమ్ముకుంటూ వచ్చాయి. వేడి గాలుల స్థానంలో చల్లని పవనాలు మృదువుగా తాకాయి. ఆ వెంటనే ఆకాశం నుంచి జారిపడ్డ వాన చినుకులు.. మండుతున్న నేల గుండెలపై పడిన అమృత బిందువుల్లా అనిపించాయి.మొదటి చినుకు నేలను తాకగానే మట్టి పరిమళం గాలిలో విరజిమ్మింది. ఉక్కపోతతో ఊపిరాడక అలమటించిన జనాలు వాన జల్లుల్లో ఉపశమనాన్ని వెతుక్కున్నారు. చిన్నారులు ఆనందంతో వర్షంలో తడుస్తూ కేరింతలు కొట్టగా పెద్దలు ఆకాశం వైపు చూస్తూ హమ్మయ్య.. అంటూ ఊపిరి పీల్చుకున్నారు. సుమారు గంట సేపు భారీ వర్షం కురిసింది. ప్రకృతి తన కరుణ చూపితే ఎంతటి ఎండనైనా ఓడించగలదని ఈ వర్షపు జల్లులు మరోసారి గుర్తుచేశాయి.

## మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి...)

కలిగి, ఎస్ఎస్సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, పీజీ తదితర అర్హతలు కలిగిన ప్రతి యువకుడు, యువతి ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. అభ్యర్థులు తమ రెజ్యూమ్‌లతో హాజరుకావడంతో పాటు http://satg.telangana.gov.in/prajapalana వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. యువత ఉపాధి పొందడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడటంతో పాటు జిల్లా సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఈ దిశగా జిల్లా పరిపాలన యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## గాలి దుమారానికి విరిగిన చెట్లు

(మొదటి పేజీ తరువాయి...)

గ్రామ సర్పంచ్ బానోతు, జ్యోతి కొండ తక్షణమే స్పందించి జెసిబి డ్రైవర్ రాజు సహాయంతో రహదారిపై పడిన చెట్లను వేగంగా తొలగించే చర్యలు చేపట్టారు. దీంతో రహదారిపై రాకపోకలు మళ్లీ సజావుగా కొనసాగాయి. స్థానికులు సర్పంచ్ బానోతు జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ, జెసిబి రాజుల తక్షణ స్పందనపై వాహనదారులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

## ఆర్టీసీ బస్సు కు తృటిలో తప్పిన ప్రమాదం...!

- వర్షం కు పంట పొలాలల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు




**నేలకొండపల్లి, మే 3 ప్రజా జ్యోతి:** వర్షంలో ఆర్టీసీ బస్సు పంట పొలాలల్లోకి దూసుకెళ్లింది. తృటిలో ప్రమాదం తప్పింది...స్థానికుల కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని మంగాపురతండాలో ఆర్టీసీ బస్సు కు ప్రమాదం తప్పింది. ఆదివారం రాత్రి కురిసిన వర్షం వలన ఖమ్మం నుంచి మంగాపురంతండా కు వచ్చిన ఆర్టీసీ బస్సు గ్రామ శివారు లోకి రాగానే బస్సు ప్రమాదవశాత్తు జారీ పంట పొలాల ల్లోకి వెళ్లింది. దీంతో ఒక్కసారిగా ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. విషయంను తెలుసుకున్న స్థానిక సర్పంచ్ ధీరావత్ ఆశోకరాణి, చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి లు ఘటనా స్థలం కు చేరుకుని జోరు వర్షం. చీకటి లో గ్రామస్తుల సహాకారంతో దగ్గర ఉండి పనులు చేయించారు. అప్పటికప్పుడు జేసీబీ ను రప్పించి బస్సు ను బయటకు లాగారు. అదే విధంగా అడ్డుగా ఉన్న చెట్ల ను తొలిగించారు. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. సకాలంలో స్పందించిన సర్పంచ్ కు ఆర్టీసీ సిబ్బంది, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.





# కూడు పెట్టని... కులవృత్తి

- వేసవిలో ప్రతి ఇంట్లో చల్లని కుండ
- టీ స్టాల్లో కుండ చాయ్ స్పెషల్
- పురాతన వస్తువుల వైపు మొగ్గు
- సీజన్ వచ్చినప్పడే అమ్మకాలు
- ఆశించిన మేర ఆదాయం లేక అవస్థలు

**ఆధునిక యుగంలో మట్టి పాత్రల వాడకం తగ్గిందనే చెప్పొచ్చు. దింతో కుల వృత్తులను నమ్ముకొని జీవనం సాగిస్తున్న వారికి ఆకలి కేకలు తప్పడం లేదు.. ప్రస్తుతం ఏ ఇంట చూసినా ఫ్రిజ్ లు, లోహపు పాత్రలే దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో చల్లని కుండ నీళ్లను తాగేందుకు జనాలు ఇష్టపడుతుంటారు. టీ స్టాల్ లో కూడా కుండ చాయ్ స్పెషల్ కాగా... పెరుగు షాపుల్లో కుండ పెరుగుకు భలే గిరాకీ ఉంటుంది. మోడ్రన్ యుగంలో కుండల వాడకం పెరిగినప్పటికి ఆశించిన స్థాయిలో ఆదాయం రావడం లేదని కుమ్మరులు అంటున్నారు.**

అయితే నిపుణులు మాత్రం మట్టి కుండలను వాడడం వలన ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని సూచిస్తున్నారు.... ఆధునిక యుగంలో అలంకార వస్తువులుగా అనేక మట్టి పాత్రలు పట్టణాల్లో కనబడుతున్నాయి. పెద్ద పెద్ద కూజాల వంటి పాత్రలు వాటిపై అనేక అలంకారాలతో పువ్వులు మొదలగు వాటితో ఎంతో అందంగా కనబడుతున్నాయి. నీళ్లకు కూజాలు, కుండలు, దీపావళికి ప్రమీదల కొరకు మట్టి పాత్రలు పట్టణాలలో ఇప్పటికీ కనబడుతూనే ఉన్నాయి. అంతరించి పోతున్న కుమ్మరి వృత్తికి పాత వాసనాలు తెలియజేయడానికి ఇవే ఆధారాలు.

**కుమ్మరి వామి అనగా..**

ఆరిన కుండలను కాల్చడానికి ఉపయోగించే ఒక పొయ్యి లాంటిది ఇది అర్ధ చంద్రాకారంలో ఉండి మధ్యలో సుమరు మూడడుగల ఎత్తు ఉండి కింద ఒక అడుగు కైవారంలో ఒక రంధ్రం ఉండి ఒక్కడుగు మందంతో గోడ ఉండి ఆ గోడ రానురాను ఎత్తు చివరకు భూ మట్టానికి ఉంటుంది. దీనినే కుమ్మరి వామి అంటారు. ఆరిన కుండలను ఇందులో నిండుగా వరుసగా పేర్చిన తర్వాత అన్ని కుండలను కలిపి పైన చెత్త, ఇతర ఆకులు, అలుములతో కప్పులాగా వేసి దానిపై బురద మట్టితో ఒక పొరలాగ అంతటికీ ఒక కప్పు వేస్తారు. ఇప్పుడు ముందున్న రంధ్రంలో చెత్త, కంపలు మొదలగునవి వేసి మంట పెడతారు. అలా సుమారు ఒక రోజు కాల్చి ఆ తర్వాత దాన్ని అలాగే వదిలేస్తారు. ఆ వామి చల్లారిన తరువాత ఒక వైపున మెల్లిగా పై నున్న కప్పును తొలగించి తనకు కావాల్సిన కుండలను తీసుకుంటారు. ఆవిదంగా కుమ్మరి కుండలను తయారు చేస్తారు.



**మట్టి కుండ ప్రత్యేకతలు..**

మట్టి కుండలు గతంలో ప్రతి ఇంట్లోను అత్యవసరం. నీళ్లు తాగే గ్లాసులు తప్ప ఇంకొన్ని చిన్న వస్తువులు తప్ప మిగతావన్ని మట్టితో చేసినవే అదొక సాంప్రదాయం. మట్టి కుండల్లో చేసిన వంటలు రుచిగా ఉంటాయని నమ్మేవారు. ఆ తర్వాత కొంత కాలానికి లోహ పాత్రలు వచ్చినా కొన్ని వంటలను మట్టి పత్రాలతోనే వండేవారు. అలా వంటింటి పాత్రలే కాక ఇళ్లలో ధాన్యం నిల్వ చేసుకునే పెద్ద వస్తువులైన ఒడ, కాగు బాన, నీళ్ల తొట్టి, పొంత మొదలగునవి కూడా మట్టితో చేసినవే. ప్రస్తుతం ఇటువంటివి చాలా వరకు కనుమరుగయ్యాయి. కొన్ని ఇళ్లలో పాతవి కొన్ని ఇప్పటికి కనబడతాయి. కరోనా మహమ్మారి పుణ్యమా అంటూ ప్రతి ఇంట్లో కుమ్మరి కుండలు వచ్చాయి. ఇంట్లో ఫ్రిజ్ ఉన్న నీరు తాగడం చాలా వరకు తగ్గించుకున్నారు. అంతే కాకుండా బిర్యానీ సెంటర్లలో కూడా కుండ బిర్యానీ



చేస్తున్నారు. గతంలో మన తాతలు, తల్లులు కుండలలో వంట చేసుకునే వాళ్ళం అని చెబితే విన్నాం. ఇప్పుడు పలు దుకాణాల సముదాయాలలో ప్రస్తుతం చూస్తూ ఉన్నాం. రాబోయే తరంలో పాత రోజులు రావచ్చేమో అందుకే ఆధునిక ఉరుకుల పరుగుల జీవితంలో కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు అర్థం చేసుకోవాలి.. ఏది ఏమైనా ప్రస్తుత కాలంలో కొంత మేరకైనా మట్టి పాత్రలను వాడి కుమ్మరులకు ఉపాది కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షాన అనేది మాటలకే పరిమితం

- కల్లాల్లో 30 రోజులుగా మొక్కజొన్నల బస్తాల దీనా దుస్థితి
- నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి లేదంటే కలెక్టరేట్ ముట్టడిస్తాం బీఆర్ఎస్ హెచ్చరిక



**చింతకాని మే 03ప్రజాజ్యోతి ప్రతినిధి** :కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షాన ఉంటుందని చెప్పేది మాటలకే పరిమితం అనడానికి నిదర్శనం కల్లాల్లో కొట్టుమిట్టాడుతున్న మొక్కజొన్నల బస్తాల దుస్థితే" అంటూ బీఆర్ఎస్ పార్టీ చింతకాని మండల నాయకులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్న శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రైతులకు జరిగిన పంట నష్టం, కరెంట్ షాక్‌తో మృతి చెందిన గేదెల ఘటన, అలాగే కల్లాల్లో 20 నుంచి 30 రోజులుగా నిల్వ ఉన్న మొక్కజొన్నల బస్తాల దుస్థితిపై ఆదివారం కోదూమూరు గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, శుక్రవారం చింతకాని మండలంలో చెలరేగిన మంటల్లో చింతకాని గ్రామానికి చెందిన దేశబోయిన వెంకటేశ్వర్లుకు చెందిన ఐదు లక్షల విలువైన ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైందని, ఆయనకు లక్ష రూపాయల పంట నష్టం కూడా వాటిల్లిందని తెలిపారు. అదే ఘటనలో కొమ్మిని పుల్లయ్య, పొనుగోటి ప్రసాద్ అనే ఇద్దరు రైతులకు చెందిన పంటలు కలిపి 2 లక్షల మేర కాలి బూడిదయ్యాయని చెప్పారు. పంట కాలిపోయి రెండు రోజులు అవుతున్నా ఇప్పటివరకు అధికారులు నష్టం అంచనా వేయలేదని మండిపడ్డారు. వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా నష్టాన్ని అంచనా వేయించి బాధిత రైతులకు ప్రభుత్వమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చింతకాని మండల పరిధిలోని తిర్లాపురం, లచ్చగూడెం, తిమ్మినేనిపాలెం, బస్వాపురం గ్రామాల్లో అగ్నికి ఆహుతైన పంటలను కూడా లెక్కించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలన్నారు. ఇక లచ్చగూడెం గ్రామంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల కరెంట్ షాక్‌తో గేదెలు మృతి చెందిన ఘటనపై స్పందిస్తూ, బాధితులకు ప్రభుత్వమే న్యాయం చేయాలని కోరారు.కాటాలు వేసి 20 నుంచి 30 రోజులు గడుస్తున్నా ఇంకా కళ్లాల్లోనే మొక్కజొన్న బస్తాలు ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే వాటిని గమ్యస్థానానికి చేర్చాలని అన్నారు. బస్తాలు,లారీల కోసం టెండర్ వేసిన వ్యక్తులు ఏమయ్యారని,ఓట్లప్పుడు వీధులు తిరిగిన నాయకులు ఎక్కడికి వెళ్లారని నిలదీశారు. ప్రభుత్వ అలసత్వం వల్ల దళారులు తక్కువ ధరకు ధాన్యం కొంటున్నారని ఆరోపించారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని,లేనిపక్షంలో పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముట్టడిస్తామని చింతకాని మండల బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మంకెన రమేష్, బొడ్డు వెంకట రామారావు, బొగరపు రాంబాబు,చిట్టినగర్ రాంబాబు,గురజాల హనుమంతరావు,గడ్డం శ్రీనివాసరావు,పొనుగోటి రత్నాకర్, వంకాయలపాటి లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# విరమణ ఉద్యోగం కే...సేవలకు కాదు

- విధుల పట్ల అంకిత భావంతో పని చేసిన భవాని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



**నేలకొండపల్లి, మే 3 ప్రజా జ్యోతి :**పదవి వీరమణ ఉద్యోగాలకే కానీ సేవలకు కాదని...రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలం లోని అప్పలనరసింహాపురం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.ఎన్.వి.ఎల్. భవాని ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం అదివారం మండల కేంద్రం లో జరిగింది.ఆయన మాట్లాడారు...ఉపాధ్యాయురాలు గా అనేక మంది విద్యార్థుల జీవితాలను మార్చారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తితో పాటు అనేక ' సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. అమె ఉద్యోగం విరమణ పొందినప్పటికీ సేవలు కొనసాగించాలని సూచించారు. అమె 'భర్త దుర్గారావు ఉపాధ్యాయుడు గా, సంఘం ప్రతినిధి గా అనేక ఉద్యమాలు నిర్వహించారని అన్నారు. ఇరువురు ప్రజా సేవలో మరింత సేవలు అందించాలని కోరారు. ఈ సభలో వివిధ ఉపాధ్యాయ సంఘా ల "ప్రతినిధులు పాల్గొని ఆమె చేసిన సేవలను ప్రసంశించారు. ఈ కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, రాష్ట్ర యువజన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తొర్తి సురేష్. టి.రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఐయన్ టియుసి ఆవిర్భావ ధినోత్సవం

- ముఖ్య అతిథిగా హాజరై ఐ యన్ టి యు సి జండాను ఎగురవేసిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా ఐ యన్ టి యు సి అద్యక్షులు కొత్తా సీతారాములు శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు జిల్లా, నగర ఐ యన్ టి యు సి బాధ్యుల ప్రమాణ స్వీకార జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా ఐ యన్ టి యు సి అద్యక్షులు కొత్తా సీతారాములు అధ్యక్షతన ఐ యన్ టి యు సి ఆవిర్భావధినోత్స వ వేడుకలు ఘనంగా నిర్వహించనైనది.ముందుగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఐ యన్ టి యు సి జెండాను ఎగురవేసినారు,అనంతరం జిల్లా ఐ యన్ టి యు సి అద్యక్షులు కొత్తా సీతారాములు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, నగర ఐ యన్ టి యు సి అద్యక్షులు నరాల నరేష్ నాయుడు,జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా ఎస్ సి సెల్ అద్యక్షులు బొడ్డు బొందయ్య,కార్పొరేటర్ కమర్తపుమురళీ,పాల్వంచ కృష్ణ మరియు ఐ యన్ టి యు సి వివిధ విభాగాల అద్యక్షులు,కార్యవర్గ సభ్యులు, ఐ యన్ టి యు సి శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా ఐ యన్ టి యు సి జిల్లా అద్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ కొత్తా సీతారాములు కి ఐ యన్ టి యు సి సోదర సోదరీమణులకు ఆవిర్భావదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.నిరంతరం ఐ యన్ టి యు సి శ్రేణులకు అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఖమ్మం కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ కార్మిక సోదర సోదరీమణులకు ఐ యన్ టి యు సి ఆవిర్భావదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.గతంలో ఐ యన్ టి యు సి శ్రేణులకు అందుబాటులో ఉన్నామని,ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామన్నారు.అనంతరం జిల్లా, నగర ఐ యన్ టి యు సి నూతన కమిటీ బాధ్యులతో ప్ర మాణ స్వీకారం చేయించారు.తదనంతరం శ్రమశక్తి అవార్డ్ గ్రహీత కొత్తా సీతారాములు, మిషన్ భగీరథ శ్రమశక్తి అవార్డ్ గ్రహీత తలారి రాములు ను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి,జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ లు శ్రేణులతో కలిసి శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కిలారి అనిల్ కుమార్,జిల్లా కాంగ్రెస్ నాయకులు రంగా జనార్ధన్, గజ్జి సూర్యనారాయణ మహ్మద్ ఫజల్,కలిమేల భద్రం,కొంగర సంగయ్య,రత్నాకర్,కోసూరి ప్రసాద్ , యం ఎస్ ఎన్ రెడ్డి,సిద్ధాల గణేష్,రంగధం, ఎస్ వి రమణ,హనుమంతరావు,హరిబాబు,రామగిరి సాంబశివరావు,అమ్మాజీ,పూతగాని రమణ, అంజు బేగం,వీరేంద్ర రెడ్డి, సైదులు ,వివిధ హోదాలలో ఉన్న ఐ యన్ టి యు సి నాయకులు పాల్గొన్నారు.



# కార్మికులకు అండగా ఐ.ఎన్.టి.యు.సి ఎమ్మెల్యే రాగమయి

- ఘనంగా ఐ.ఎన్.టి.యు.సి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**సత్తుపల్లి మే03(ప్రజా జ్యోతి)**ఐ.ఎన్.టి.యు.సి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు , సెక్రటరీ జనరల్ మినిమం వేజెస్ చైర్మన్ జన ప్రసాద్ సూచన మేరకు వారి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పి.వి.ఎన్.ఆర్ కాలనీలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మాట్టా రాగమయి దయానంద్ హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 79వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు జరుపుకోవడం ఎంతో అభినందనీయమని, భారతదేశ స్వతంత్రం రాకముందే ఐఎన్టియుసి ఆధ్వర్యంలో కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది అని,కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేసిన ఘనత ఐ ఎన్ టి యు సి కె దక్కిందని అన్నారు. భారతదేశంలో 3 కోట్ల 50 లక్షల పై సభ్యత్వం కలిగిన అతిపెద్ద యూనియన్ ఐ ఎన్ టి యు సి అని, కార్మికుల హక్కుల కోసం యూనియన్ ముందు ఉంటుందని తెలిపారు. కనీస వేతనాల భద్రత, ఉద్యోగ భద్రత, సింగరేణి డిపెండెంట్ కార్మికుల ఉద్యోగాల కోసం, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం, రిటైర్డ్ ఉద్యోగుల కార్మికుల పెన్షన్ పెరుగుదల కోసం, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా ఇప్పించిన ఘనత ఐ.ఎన్.టి.యు.సికి దక్కిందని అన్నారు. అదేవిధంగా వైస్ ప్రెసిడెంట్ సూచన మేరకు అసిస్టెంట్ సెక్రటరీ ఫిట్ సెక్రెటరీ బాలాజీ,శ్రీధర్ అధ్యక్షతన కిష్టారం ఓసీలో, సి హెచ్ పి ఫిట్ సెక్రటరీ నగేష్ అధ్యక్షతన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, బ్రాంచ్ సెక్రటరీ నాగ ప్రకాష్ నాయకులు సందీప్,హరికుమార్,అశోక్, ఇక్బాల్,సుదర్శన్,శ్రీనివాస్, గోపి,వెంకటేష్,హమీద్, వెంకటేశ్వర్లు,మోరే సుదర్శన్,రామచందర్, షద్రగ్ బాబు,కనకయ్య, బాలు,రాజ్ కుమార్,దాసరి శ్రీనివాస్,రవికాంత్,శ్రీకాంత్, రాజేందర్,సుకురు, షణ్ముఖచారి,కాంటాక్ట్ కార్మికుల ఇంచార్జి సుభాని, దీపక్,శ్రీపాటి శ్రీను,శోభన్ బాబు,తన్నీరు శ్రీనివాస్, ఇతర ఐఎన్టియు ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

# ఖమ్మం నగరం 42వ డివిజన్‌లో ఘనంగా జనసేన పార్టీ దిమ్మె ఆవిష్కరణ

**ఖమ్మం ,మే 3 ప్రజా జ్యోతి :**ఖమ్మం నగరంలోని 42వ డివిజన్‌లో జనసేన పార్టీ నాయకురాలు కొప్పుల విజయలక్ష్మి గారు, కొప్పుల నిర్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ దిమ్మె ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ మిరియాల రామకృష్ణ పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మిరియాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిస్థితులపై ఘాటుగా స్పందించారు:గత పదేళ్ల బిఆర్ఎస్ (TRS) పాలనలో ఖమ్మం నగరం ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పాత ధోరణిలో వెళ్తుందే తప్ప, ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదు. పాలకుల తీరుతో నగరం నేడు అనేక సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది.ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస సదుపాయాలు లేక పేద ప్రజలు అల్లాడుతున్నారు. మరోవైపు ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజుల పేరిట సామాన్యులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. ఈ దోపిడీని అరికట్టడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారు.నగరంలో శాంతిభద్రతలు కరువయ్యాయి. యువతకు ఎటువంటి ఉపాధి కల్పన లేకపోవడంతో వారి భవిష్యత్తు అంధకారంలో పడిపోయింది. మార్పు కావాలని కోరుకునే మహిళలు, యువత పెద్ద ఎత్తున రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉంది.పవన్ కళ్యాణ్ ఆశయాలతో జనసేన పార్టీ ఖమ్మం నగరంలో రోజురోజుకూ బలోపేతం అవుతోంది. రాబోయే రోజుల్లో ప్రజా పక్షాన నిలబడి ఈ వ్యవస్థలో మార్పు తీసుకురావడమే మన లక్ష్యం.ఈ కార్యక్రమంలో బండారు రామకృష్ణ,ఉత్తమ్ రాజ్ ,దేవేందర్, షేక్ హసీనా,రమణ కుమార్,పుల్లారావు,గంగాధర్,ఉదయ్, వంశీ,మణికంఠ, శీలం వంశీ డివిజన్ ముఖ్య నాయకులు, కొప్పుల నాగేంద్ర కుమార్,కుమ్మరి వినోద్,కుమ్మరి ప్రమోద్,గుత్తికొండ సతీష్,నర్సింహుల శ్రీను, శ్రీరంగం పుష్ప,ఉప్పల, కొప్పుల అనూష, కొప్పుల ఉమారాణి,కొప్పుల సాయి,కుమ్మరి చరణ్,కొప్పుల కార్తీక్, కుమ్మరి సాయి జనసైనికులు, వీర మహిళలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "జై జనసేన" నినాదాలతో 42వ డివిజన్ పరిసర ప్రాంతాలు మారుమోగాయి.



## పాత్రికేయులకు ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవ శుభాకాంక్షలు

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఆదివారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మూలస్థభం,ప్రజల స్వరాన్ని వినిపించే ప్రతిబింబం,నిజాన్ని నిగ్గు తేల్చే నిశ్శబ్ద తరంగం,సమాజానికి దారి చూపే జ్ఞానదీపం, సత్యం నిలిచేలా,స్వేచ్ఛ నిలబడేలా అక్షరసేద్యం చేస్తున్న పాత్రికేయులందరికి ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.

## నూతన దంపతులను ఆశీర్వాదించిన అంబటి





**చింతకాని మే 03ప్రజాజ్యోతి ప్రతినిధి షేక్ సైదులు:** మండలం నాగులవంచ గ్రామంలోని కాకర్ల వెంకటేశ్వర్లు కళావతి దంపతుల కుమార్తె పూజిత రామ్ గోపాల్ వివాహం బోనకల్ మండలం లోని చిన్నబీరెల్లి గ్రామంలో జరిగిన వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమంలో మత్కేపల్లి సర్పంచ్ కంచం ద్రౌపతి కోటేశ్వరరావు,సిలువేరు సైదులు, ఇమ్మడి కాశయ్య, ఇమ్మడి లక్ష్మణరావు,ఎరదేశి రవి,మాగం కొండలరావు,ఎరదేశి కృష్ణ, తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## సోమలింగంకు జిల్లా కాంగ్రెస్ నాయకురాలి నివాళులు

**కారేపల్లి, మే 3, ప్రజా జ్యోతి :** సింగరేణి మండలం రేలకాయలపల్లి గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోనగిరి సోమలింగం (72) ఆదివారం అనారోగ్యంతో మరణించారు. వారి మృతి పట్ల కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సోమలింగం భౌతిక కాయానికి కాంగ్రెస్ కండువా కప్పి, పూలమాలవేసి, నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు .ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ సోమలింగం పార్టీ పట్ల ఎంతో విధేయత కలిగిన నాయకులు,అయన మరణం మనందరికీ, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రేలకాయలపల్లి సర్పంచ్ తేజావత్ శిరీష రమేష్, గేట్ రేలకాయలపల్లి సర్పంచ్ కేళోత్ మంగబన్సీ, వైరా ఆత్మ కమిటీ డైరెక్టర్ పోతుల నరసింహారావు, గ్రామ శాఖ అధ్యక్షులు తేజావత్ బాలు,గిద్దెవారిగూడెం సర్పంచ్ వీసాల వెంకటేశ్వర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మోహన్,నరేష్, శోభన్, నాగులు, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు ఎండి హనీఫ్, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యవసాయంపై ప్రణాళిక లేదు

- చలనం లేని చెత్త దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం
- జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న రైతులకు లేని ఉపయోగం
- రైతుల పోరాటంతోనే కొనుగోలు కేంద్రాలు వచ్చాయి
- మళ్లీ రైతుల పోరాటంతోనే కొనుగోలు కేంద్రంలో బస్తాలు కదులుతాయి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు
- కొనుగోలు కేంద్రంలో కాటా వేసి తరలించకుండా ఉన్న బస్తాలను పరిశీలిస్తున్న పోతినేని, బొంతు
- ప్రభుత్వం పెడుతున్న ఇబ్బందులను నాయకులకు వివరించిన రైతులు..





**బోనకల్, మే 3 (ప్రజా జ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యవసాయంపై చిత్తశుద్ధి లేదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు మండిపడ్డారు.రైతుల పంటను కొనుగోలు చేయలేని చెత్త, చేతకాని, దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యవసాయ రంగంపై ఏమాత్రం ప్రణాళిక లేదని, రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన ఘాటుగా విమర్శించారు.మండల పరిధిలోని లక్ష్మీపురం, రావినూతల సొసైటీ పరిధిలోనే కొనుగోలు చేసి కల్లాలలో నిల్వ ఉన్న మొక్కజొన్న బస్తాలను, కల్లాలలో ఉన్న మొక్క జొన్నలను ఆదివారం పోతినేని సుదర్శన్ రావు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, మధిర డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు,సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, రైతులతో కలిసి ఆదివారం పరిశీలించారు. అనంతరం గోవిందాపురం ఎల్,రావినూతల మొక్కజొన్న రైతులు తమ బాధలను వారికి వివరించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ మొక్కజొన్నలను కొనుగోలు చేయకుండా తమను కొనుగోలు కేంద్రం అధికారులు, ప్రభుత్వం పెడుతున్న ఇబ్బందులను వారికి వివరించారు. తామే బస్తాలు తెచ్చుకుంటున్నామని చివరికి లారీలు కూడా తామే తెచ్చుకుంటున్నామని రైతులు వారికి వివరించారు.రైతుల సమస్యలను వారు సావధానంగా విన్నారు. ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ. రైతుల పోరాట ఫలితంగానే బోనకల్ మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారన్నారు. కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు ఎంతో ఆర్భాటంగా ప్రారంభించి ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రకటించారన్నారు.కానీ మొక్కజొన్నలను కొనుగోలు చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఘాటుగా విమర్శలు వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ బాధ్యత నుంచి తప్పుకొని రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గం లో మొక్కజొన్న రైతుల పరిస్థితి ఈ విధంగా ఉండటంతో ప్రతి రైతు కన్నీరు పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా నియోజకవర్గాలలో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థమవుతుందన్నారు. రైతులే బస్తాలు కొనుగోలు చేసుకుని తెచ్చుకుంటున్నారని, చివరకు లారీలను కూడా రైతులే కిరాయి చెల్లించి తెచ్చుకునే దుస్థితికాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పడిందని విమర్శించారు. లారీ డ్రైవర్ బస్తా కి రూ. 40 రూపాయలు వసూలు చేస్తున్నా ఈ ప్రభుత్వానికి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు కళ్ళు లేవా? ఉంటే ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. మాట్లాడితే ముఖ్యమంత్రి ఫీచర్ సిటీ అంటున్నారని, రైతుల గురించి పట్టించుకోవటం లేదని విమర్శించారు. ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ఊక దంపుడు ఉపన్యాసాలు చేసిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఎక్కడ ఉన్నారని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రభుత్వంలో రైతులకు అన్నీ కష్టాలనే ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బోనకల్ మండలంలో కొనుగోలు కేంద్రాల పరిధిలో కల్లాలలో వేలాది బస్తాలు, మొక్కజొన్నలు ఉన్నాయన్నారు. ఒక వైపు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుంటే రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, అయినా ప్రభుత్వం చలించకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో యూరియా కొరత, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల కొరత, మొక్కజొన్నల కొనుగోళ్ళ పై పరిమితి విధిస్తూ రైతులను ఆర్థికంగా తీవ్రంగా నష్టపరుస్తుందని విమర్శించారు. ఆరు గాలం అనేక కష్టాలు పడి పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధి తెలియజేస్తుందన్నారు. గోడౌన్ల సౌకర్యం కల్పించవలసిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదా అని ఆయన ప్రశ్నించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వాలకు గతంలో ఏ గతి పట్టిందో కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా భవిష్యత్తులో అదే గతి పడుతుందని ఆయన హెచ్చరించారు. రోజు రోజుకి వాతావరణంలో వస్తున్న మార్పులకు అన్నదాతలు తీవ్ర ఆందోళన ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, అయినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. డిప్యూటీ సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి, రెవిన్యూ శాఖ మంత్రి జిల్లాలో ఉన్నప్పటికీ రైతులకు జరిగిన ఉపయోగం మాత్రం శూన్యం అన్నారు.రైతులందరూ కదిలితేనే బోనకల్ మండలానికి మొక్కజొన్న కనుగోల కేంద్రాలు మంజూరయ్యాయని, మరల రైతులు కదిలితేనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్న బస్తాలు కదులుతాయని, రైతుల పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వారి వెంట గోవిందాపురం ఎల్ సర్పంచ్ మంద కరుణ, మాజీ సర్పంచ్ కొమ్ము కమలమ్మ, రైతులు మాదినేని వీరభద్రరావు, జొన్నలగడ్డ సునీత, ఏడునూతల లక్ష్మణరావు, దొండపాటి సత్యనారాయణ, జోనిబోయిన గురవయ్య, ఎర్రగాని నాగరాజు, షేక్ నన్నేసాహెబ్, గుగులోత్ నరేష్, గుడ్డూరి ఉమ, గుడ్డురి వెంకట నరసయ్య రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా తక్షణమే లారీలు సరఫరా చేయాలి

- సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు



**చింతకాని మే 03ప్రజాజ్యోతి ప్రతినిధి షేక్ సైదులు:** ఈ రోజు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న దిగుమతి జరుగుతుందని తెలుసుకొని వెళ్లి పరిశీలించి అక్కడే ఉన్న లారీ కాంట్రాక్టర్ వీరభద్రంను కలిసి చింతకాని మండలంలో అన్ని అన్ని గ్రామాలకు తక్షణమే లారీలు పంపించాలని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించద్దని సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు కోరారు.

## పాతర్లపాడు గ్రామంలో మొక్కజొన్న చేనుకు నిప్పు అంటించిన గుర్తు తెలియని వ్యక్తి



**చింతకాని మే 03ప్రజాజ్యోతి ప్రతినిధి షేక్ సైదులు :** పాతర్లపాడు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టటం తో మంటలు చెలరేగి మొక్కజొన్న కళ్ళలో అంటుకోవడం తో ఈదురు గాలులకు మంటలు చెలరేగి బీభత్సం సృష్టించడం వలన తోటి రైతుల మొక్కజొన్న కంకి కాలిపోతున్న సమయంలో పాతర్లపాడు గ్రామ సర్పంచ్ ఓబినబోయిన లక్ష్మి–అచ్చయ్య సకాలం లో స్పందించి వాటర్ టాంకర్ ద్వారా మరియు గ్రామ ప్రజల సహకారం ద్వారా మంటలు అదుపులోకి తీసుకురావటం జరిగింది.గ్రామ ప్రజలు ప్రభుత్వం పై తీవ్ర హర్షం వ్యక్తపరిచారు మొక్క జొన్న కాటాలు వేసి నెలలు గడిచినా పండించిన మొక్కజొన్న పంట కాటాలు (తూకం) వేసినప్పటికీ,బస్తాలను తరలించడానికి లారీలు లేక అవి అక్కడే ఉండిపోయాయి.దీనివల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే లారీలను ఏర్పాటు చేసి ఆ బస్తాలను తరలించాలని కోరుతున్నారు.పాతర్లపాడు పంచాయతీ సిబ్బంది గ్రామ రైతు సోదరులు,గ్రామ యువత పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎండలతో అప్రమత్తంగా ఉండాలి

- బత్తినేని ట్రస్ట్ వైద్య సేవలు అభినందనీయం
- 68వ బిపి, షుగర్ ప్రత్యేక క్యాంపు విజయవంతం
- ప్రముఖ బిపి, షుగర్, జనరల్ వైద్య నిపుణులు టి పవన్ కుమార్



**బోనకల్, మే 3 (ప్రజా జ్యోతి):** దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎండలతో అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ బిపి, షుగర్, జనరల్ వైద్య నిపుణులు టి పవన్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో అమరజీవి, సిపిఐ సీనియర్ నాయకులు తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం బిపి, షుగర్ 68వ ప్రత్యేక క్యాంపు తూము ప్రకాశరావు భవన్లో ఆదివారం విజయవంతమైంది. ఈ సందర్భంగా వైద్యులు టి పవన్ కుమార్ మాట్లాడుతూ... వేసవి కాలంలో పెరుగుతున్న ఎండల తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, చిన్నారులు ప్రత్యేక అప్రమత్తత పాటించాలన్నారు. వడదెబ్బ, డిహైడ్రేషన్ వంటి ఆరగ్యో సమస్యల నుండి రక్షణ పొందేందుకు తలకు టోపీ, గొడుగుతో పాటు కళ్లద్దాలు ధరించాలని సూచించారు. ముఖ్యంగా ఆహారపు అలవాట్లు టీ, కాఫీ, ఆల్కహాల్ దూరంగా ఉండాలని, తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్న వారు ఎండలో ఉంటే శరీరాన్ని చల్లబరచడానికి గుండెపై ఒత్తిడి పడుతుందని, కాబట్టి గుండె జబ్బులు ఉన్న వారు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న ఆహారాన్ని పండ్లను తీసుకోవాలని, వైద్యుల సలహా మేరకు క్రమం తప్పకుండా మందులను వాడాలని పేర్కొన్నారు. షుగర్, బిపి ఉన్నవారు పట్టణ ప్రాంతానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలంటే మందులతో సహా వేలల్లో ఖర్చు అవుతున్నాయని అన్నారు. ప్రత్యేక క్యాంపు వచ్చే వారికి ఖర్చుతో పాటు సమయం కూడా కలిసి వస్తుందని పేర్కొన్నారు. ఈ క్యాంపులో 100 మందికి వైద్యులు పవన్ కుమార్ వైద్య సేవలు అందించగా, క్యాంపు నిర్వాహకులు క్యాంపు నిర్వహించారు. ఐదేళ్లుగా నిర్విరామంగా క్యాంపులను నిర్వహిస్తున్న బత్తినేని చారిటబుల్ ట్రస్ట్, సిపిఐ మండల సమితి సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, మండల కార్యవర్గ సభ్యులు ఆకెన పవన్, కొంగర కృష్ణయ్య, కొంగర భాస్కరరావు, సిపిఎం నాయకులు షేక్ నజీరు, టిడిపి నాయకులు దుగ్గి భద్రయ్య, క్యాంపు సహాయకులు యంగల గిరి, గొల్లపల్లి కృష్ణారావు, ఉజ్వల్ చరణ్, టి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయానికి పంచలోహ విగ్రహాల బహుకరణ

- విగ్రహాల దాత గుగులోతు రవి(బెల్ రవి) దంపతులు



**కారేపల్లి, మే 3, ప్రజా జ్యోతి :** సింగరేణి మండల పరిధిలోని వెంకట్యతండా గ్రామంలో కొలువై ఉన్న శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయానికి,భల్లునగర్ తండా గ్రామానికి చెందిన గుగులోత్ రవి దంపతులు రూ.1,07,116 రూపాయలు విలువ చేసే సీతారామ,లక్ష్మణ,ఆంజనేయ స్వామి పంచలోహ విగ్రహాలను వితరణగా అందజేశారు.దైవ కార్యక్రమాల్లో భాగంగా గ్రామస్థులు మూడు రోజుల నుండి ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గుగులోత్ రవి (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మేనేజర్) దంపతులు స్వామివారి కల్యాణం,ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ఘనంగా నిర్వహించిన ఈ దైవ కార్యక్రమంలో మా దంపతులను భాగస్వాములు చేసినందుకు ఎంతో సంతోషంగా ఉన్నట్లు తెలిపారు.అనంతరం మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లా నాయక్ మాట్లాడుతూ గ్రామంలో మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించిన దైవ కార్యక్రమాల ద్వారా వెంకట్యతండా గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో,పాడిపంటలతో వర్ధిల్లాలని శ్రీఅభయాంజనేయస్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు.దాతల సహకారంతో పాటు,గ్రామస్తుల సహకారం,యువత భాగస్వామ్యం ద్వారా ఈ దైవ కార్యక్రమం గొప్పగా నిర్వహించడం జరిగిందన్నారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ బుల్లి,మంగళం కంపెనీ ఎండీ గుగులోతు రాజేందర్,మాజీ సర్పంచులు,వెంకట్యతండా గ్రామస్తులు,ఉద్యోగస్తులు,యువత తదితరులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో అకాలవర్షం

- ధాన్యం కొనుగోలుకేంద్రంలో తడిసి ముద్దైన మొక్కజొన్న ధాన్యం
- పలుచోట్ల నేలకు ఒరిగిన వృక్షాలు
- జెసిపి సహాయంతో చెట్లను తొలగిస్తున్న సర్పంచ్ అశోక రాణి





**నెలకొండపల్లి, మే 3 ప్రజా జ్యోతి :** మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు వీయడంతో పాటు ఉరుముల మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. దాంతో మండలంలో రైతులు కల్లాలలో ఆరబోసుకున్న మిర్చి తడిసి ముద్దయి వేలాది రూపాయల నష్టం వాటిల్లింది. ముఠాపురం కొనుగోలు కేంద్రం వద్ద మొక్కజొన్న తడిసి ముద్దయింది. దీంతోభారీ నష్టం వాటిల్లిన రైతులు దిక్కుతోచక బోరుమంటున్నారు. మంగాపురం గ్రామంలో రోడ్ల పై చెట్లు విరిగిపడటంతో వెంటనే స్పందించి సర్పంచ్ అశోకా రాణి జెసిపి సా యంతో చెట్లను తొలగించారు. చెట్లు విరిగి రోడ్డుకి అడ్డంగా పడ్డాయి, అంతా క్లియర్ చేయించారు. మండలంలో పలు గ్రామాలలో రహదారుల వెంట ఈదురుగాలికి అక్కడక్కడ భారీ వృక్షాలు నేల కొరిగాయి. పలు గ్రామాల సర్పంచులు తమ పంచాయతీ పరిధిలో నేలకొరిగిన వృక్షాలను రోడ్డుపై నుండి తొలగించి, దారులను క్లియర్ చేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బం ది తొలగిపోయింది. మండలంలో పలుచోట్ల స్తంభాలు నేలకొరిగి తీగలు తెగడంతో, మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాగా విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా కోసం లైన్ల వెంబడి మరమ్మతులు చేపట్టారు. ఏది ఏమైనా ఈ అకాల వర్షం అన్నదాతలకు భారీ నష్టం చేకూర్చడంతో, రైతుల కళ్ళలో కన్నీరే మిగిలింది. చేతికి అంది వచ్చిన పంట నీటి పాలు కావడంతో ప్రభుత్వం తమను ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

## శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహా ప్రతిష్ట

- నేటి నుండి పూజలు ప్రారంభం.
- బుధవారం విగ్రహాల ప్రతిష్ట.



**కారేపల్లి, మే3, ప్రజా జ్యోతి:** సింగరేణి మండలం అనంతారం తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 6 బుధవారం నాడు విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం నిర్వహించబడుతుందని ఆలయ నిర్వహణ కమిటీ తెలిపారు. ఆదివారం అనంతారంలో వారు మాట్లాడుతూ సోమవారం పూజలు ప్రారంభమై, మంగళవారం కొనసాగుతాయని తెలిపారు. మహాధ్వజ, వృష్ట్రారూఢ, నాభిశిల, ముత్యాలమ్మ ,కోట మైసమ్మ, పోతురాజు లను స్థిర ప్రతిష్టించడం జరుగుతుందన్నారు. బుధవారం ఉదయం 9:52 గంటలకు వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్టిస్తారని, అనంతరం మహా అన్న ప్రసాదం వితరణ గావించబడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి గ్రామస్తులు సహకరించి, విజయవంతం కావడానికి తోడ్పడాలని నిర్వహణ కమిటీ వారు కోరారు.

## సత్య సాయి ప్రేమామృతవిద్యా నికేతన్ పాఠశాల ప్రకృతి వైద్యాలయమునకు భూమి పూజ



**చింతకాని మే03 ప్రజాజ్యోతి ప్రతినిధి షేక్ సైదులు:** భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి దివ్య ఆశీస్సులతో ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగలవంచ గ్రామంలో తేదీ 9-5 2026న ఉదయం10:30 గంటలకు శ్రీ సత్య సాయి ప్రేమామృత విద్యా నికేతన్ పాఠశాల నిర్మాణము మరియు ప్రకృతి వైద్యాలయమునకు భూమి పూజ కార్యక్రమము ఏర్పాట్లు గురించి ఆదివారం నాడు నాగులవంచ టు సీతంపేట రోడ్డు మధ్యలో శ్రీ కాటమయ్య దేవస్థానం ఎదురుగా ఉన్న శ్రీ చల్లా కోటయ్య ఐదు ఎకరాల భూమి నందు ఏర్పాటు గురించి సైట్ క్లీనింగ్ శ్రీ సత్యసాయి సేవా సంస్థల వారి ఆధ్వర్యంలో జరిగినది ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ దమ్మాల్ దమ్మాలపాటి సుధాకర్ మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు భజన మండలి కన్వీనర్లు చుట్టుపక్కల గ్రామాల వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో నష్ట పోయిన రైతులను పరమర్శించిన అంబటి

- విషయాన్ని డిప్యూటీ సిఏం దృష్టికి తీసుకెల్లి రైతులను ఆదుకుంటామని హామీ



**చింతకాని మే 03ప్రజాజజ్యోతి ప్రతినిధి :** చింతకాని గ్రామంలో గత రెండు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే దేశబోయిన వెంకటేశ్వర్లు అనే రైతు ట్రాక్టర్ అగ్నికి ఆహుతై పూర్తిగా దగ్ధమైంది.ఈ ఘటన నేపథ్యంలో ఈరోజు రైతు పొలం వద్దకు వెళ్లి బాధిత రైతును పరామర్శించిన మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు ఘటనపై స్పందిస్తూ తక్షణమే నష్టం జరిగిన రైతులకు పంట నష్టం పరిహారం అందేలా,అలాగే ట్రాక్టర్ నష్టపోయిన రైతుకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు తక్షణ సాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్ల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొప్పుల గోవిందరావు,ఖమ్మం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడుపల్లి బాస్కర్ ,మాజీ సర్పంచ్ బండి సైదేశ్వరరావు,బండి తిరపయ్య,మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్.కె. కాసిం, ఎస్.కె. దస్తగిరి,చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ సభ్యులు కొమ్మినేని రామారావు,పెదగాండ్ల వెంకటనారాయణ,తూము బిక్షం,సిలివేరు సైదులు,తూము ప్రభాకర్,పోతన,బోయిన వెంకటేశ్వర్లు,చింతకాని మత్స్యశాఖ అధ్యక్షులు జలగనబోయిన కృష్ణ,తదితరులు పాల్గొన్నారు

## సబ్ స్టేషన్ సమస్య త్వరలో పరిష్కారం

- ఎమ్మెల్యే హామీ



**కారేపల్లి, మే 3, ప్రజా జ్యోతి :** సింగరేణి మండలం భాగ్యనగర్ తండా 33 /కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ కు స్థలం ఇచ్చిన లకావత్ లక్ష్మి కి గత ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీలు నేరవేర్చక పోవడం తో తాను అనేక సార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాక పోవడం తో ఆదివారం ఉదయం నుండి విద్యుత్ సరఫరా నిలిపి నిరసన వ్యక్తం చేసింది. ఈ విషయం తెలిసిన వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ వెంటనే విద్యుత్ కార్యాలయంకు చేరుకొని , సంబంధిత శాఖ అధికారులతో, బాధితురాలితో మాట్లాడి, సమస్యను అతిత్వరలో పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. అప్పటి వరుకు ప్రజలకు ఇబ్బంది పెట్టవద్దని కోరారు. తాత్కాలిక పద్దతి లో ఉద్యోగం ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోతు హిరాలాల్, సింగరేణి సర్పంచ్ మేదర వీర ప్రతాప్ (టోని )జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాణోత్ రామ్మూర్తి నాయక్ , జిల్లా కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల, మాజీ సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస రావు, నాయకులు గుగులోత్ భీముడు , సొసైటీ మాజీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

## జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సమ్మర్ క్యాంప్





**సత్తుపల్లి మే03(ప్రజా జ్యోతి )**జమాతె ఇస్లామీ హింద్ సత్తుపల్లి శాఖ వారి ఆధ్వర్యంలో స్టూడెంట్స్ సమ్మర్ ఇస్లామిక్ క్యాంప్,గత మూడు రోజులుగా సత్తుపల్లి పట్టణంలో స్థానిక మేరాజ్ మస్జిద్ వెంగళరావు నగర్ లోఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఒక విద్యార్థి సంఘం లో ఏ విధంగా రోల్ మోడల్ గా ఉండాలో తల్లీ తండ్రులతో, పొరుగు వారి తో మన తోటి బంధువులతో ఎలా ఉండాలో నైతిక విలువలు క్రమశిక్షణ అన్ని విషయాలు తెలిపారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షులు అన్వర్,యండి ముజీబ్,సత్తుపల్లి జమాతే ఇస్లామీ హింద్ బాధ్యులు అమీరుద్దీన్,నజీర్ పాషా, హాఫిజ్ హుస్సేన్ ,ఈ కార్యక్రమ కన్వీనర్ సాదిక్ , తదితరులుపాల్గొన్నారు.

# సింగరేణి మండల వ్యాప్తంగా ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో అకాలవర్షం

- ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసి ముద్దైన మొక్కజొన్న ధాన్యం
- దిక్కుతోచక విలపిస్తున్న రైతన్నలు
- పలుచోట్ల నేలకు ఒరిగిన వృక్షాలు
- మాదారంలో స్తంభాలు నేలకొరిగి, తెగిన విద్యుత్ తీగలు
- పరిస్థితి తెలుసుకొని వెంటనే స్పందించిన ఎమ్మెల్యే





**కారేపల్లి, మే 3, ప్రజా జ్యోతి :** సింగరేణి మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు వీయడంతో పాటు ఉరుముల మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. దాంతో మండలంలో రైతులు కల్లాలలో ఆరబోసుకున్న మిర్చి తడిసి ముద్దయి వేలాది రూపాయల నష్టం వాటిల్లింది. మాదారంలో కొనుగోలు కేంద్రం వద్ద మొక్కజొన్న తడిసి ముద్దయింది. దీంతోభారీ నష్టం వాటిల్లిన రైతులు దిక్కుతోచక బోరుమంటున్నారు. విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ మొక్కజొన్నలను అప్పాయిగూడెం గోడౌన్కు వెంటనే తరలించాలని అధికారులను ఆదేశించారు. సింగరేణి గ్రామపంచాయతీలో చెట్లు విరిగి రోడ్డుకి అడ్డంగా పడ్డాయి, రోడ్ల వెంట నీరు నిలువలు చేరి ప్రజలకి ఇబ్బంది కలిగింది వెంటనే సర్పంచ్ మేదర వీర ప్రతాప్ (టోని ) స్పందించి అంతా క్లియర్ చేయించారు.మాదారంలో చెట్లు విరిగి రోడ్డుకి అడ్డంగా పడ్డాయి, స్తంభాలపై పడి స్తంభాలు నేలకొరిగి, తీగలు తెగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మండలంలో పలు గ్రామాలలో రహదారుల వెంట ఈదురుగాలికి అక్కడక్కడ భారీ వృక్షాలు నేల కొరిగాయి. గాలివాన బీభత్సానికి మాణిక్యారంలో కొండ నాగేంద్ర కుమార్ ఇంటి రేకుల పైకప్పు ఎగిరపోయాయి,సింగరేణి సర్పంచ్ వీర ప్రతాప్,గాదెపాడు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్, మాదారం సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్తో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల సర్పంచులు తమ పంచాయతీ పరిధిలో నేలకొరిగిన వృక్షాలను రోడ్డుపై నుండి తొలగించి, దారులను క్లియర్ చేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది తొలగిపోయింది. మండలంలో పలుచోట్ల స్తంభాలు నేలకొరిగి తీగలు తెగడంతో, మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాగా విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా కోసం లైన్ల వెంబడి మరమ్మతులు చేపట్టారు. ఏది ఏమైనా ఈ అకాల వర్షం అన్నదాతలకు భారీ నష్టం చేకూర్చడంతో, రైతుల కళ్ళలో కన్నీరే మిగిలింది. చేతికి అంది వచ్చిన పంట నీటి పాలు కావడంతో ప్రభుత్వం తమను ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

# మక్క కొనుగోలు కేంద్రాలకు గన్నీ బ్యాగులతో వస్తే వాటికీ ప్రభుత్వం చెల్లింపులు చేస్తుంది

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- మక్క నిల్వలకు స్థలాలు గుర్తించి వెంటనే తరలింపు చర్యలు
- రైతులకు చెల్లింపులు ఆలస్యం లేకుండా పూర్తి చేయాలి
- అకాల వర్షాల నేపథ్యంలో మొక్కజొన్న, ధాన్యం కొనుగోలుపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :**మక్క కొనుగోలు కేంద్రాలకు గన్నీ బ్యాగులతో వస్తే వాటికీ ప్రభుత్వం చెల్లింపులు చేస్తుందని, ఈ విషయం ప్రతి రైతుకు తెలిసేలా అధికారుల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు.ఖమ్మం జిల్లాలో అకాల వర్షాల నేపథ్యంలో మక్క, ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆదివారం రాత్రి సంబంధిత అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ మక్క కొనుగోళ్ల పై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కొనుగోలు చేసిన మక్కను భద్రపరచేందుకు తగిన స్థలాలను గుర్తించి వెంటనే తరలించాలని సూచించారు.వర్షాలకు తడిసిన మక్కను తప్పనిసరిగా ఆరబెట్టి తర్వాత మాత్రమే లోడ్ చేయాలని ఆదేశించారు. కొణిజర్ల, చింతకాని, మద్దులపల్లి ప్రాంతాల్లో మక్క నిల్వలు ఎక్కువగా ఉన్నందున ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. 60 వేల టన్నులు రైతుల నుంచి వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.రవాణాకు అవసరమైన వాహనాలు సిద్ధంగా ఉంచాలని, లోడింగ్ హమాలీల సమస్యలను తగ్గించాలని సూచించారు.మార్క్‌ఫెడ్ పరిధిలోని 40 కేంద్రాల్లో కొనుగోలు జరుగుతున్న మక్కలో ఎంత మోతాదు వర్షాలకు తడిసిందో 24 గంటల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు.రైతులు గన్నీ బ్యాగులతో మక్క తీసుకొచ్చినా వాటికీ చెల్లింపులు చేస్తామని స్పష్టంగా తెలియజేయాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో దీనిపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు.ధాన్యం కొనుగోళ్ల పై కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు పెద్దగా నష్టం సమాచారం లేనప్పటికీ, వాతావరణ నిపుణుల హెచ్చరికల మేరకు సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం వరకు భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ధాన్యం కొనుగోళ్ల కోసం లారీలు సిద్ధంగా ఉంచాలని, అదనపు వాహనాలను వినియోగించాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు సంబంధించి 36 వేల టన్నుల ధాన్యం వచ్చినప్పటికీ ఇప్పటివరకు 20 వేల టన్నులు మాత్రమే కొనుగోలు చేసినందున పెండింగ్ కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఐకేపీ పరిధిలో పెండెన్సీ ఎక్కువగా ఉన్నందున తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు.కూసుమంచి మండలంలో తడిసిన ధాన్యాన్ని లారీల ద్వారా బాయిల్డ్ రైస్ మిల్లర్లకు తరలించి అన్‌లోడ్ చేయాలని సూచించారు. రైతులకు చెల్లింపులు నిరంతరం జరుగుతూ ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం కాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో డిఎం మార్క్ ఫెడ్,జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి, కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలు, సంబంధిత అధికారులు, సహకార అధికారి,తదితరులు పాల్గొన్నారు.